www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 14 | ఫిబ్రవరి | 2025 పేజీలు 8

## ఇష్టానుసారంగా వ్యవహరిస్తే వేటు తప్పదు



-ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి
-పనుల్లో నాణ్యత లేకుంటే బిల్లులు చెల్లించవద్దు
-ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ కార్యకలాపాలపై కలెక్టర్ సమీక్ష

2 లో



- శాపంగా మారిన కర్మాగారాలు
- నల్లబారిన పంటలు.. మాయమైన పచ్చదనం
- ఆవైపుకు వెళితే శరీరమంతా దురద, మంటలు
- కనుమరుగైన నెమళ్లు.. వలస వెళ్లిన జీవాలు

# రైతుల జీవితాలను కమ్మేస్తున్న పొగ..!





**రెండు కర్మాగారాలు రైతుల జీవితాలను ఛిద్రం చేస్తున్నాయి. ఆ ఫ్యాక్టరీల పొగలు రైతుల జీవితాలను కమ్మేస్తూ భవితను అంధకారం చేస్తున్నాయి.** కర్మాగారం నుంచి వచ్చే పొగ చుట్టు మూడు కిలో మీటర్ల మేర పచ్చదనాన్ని హరించివేసింది. పంటలు పొగబారి ఎదుగు బొదుగు లేకుండా పోయాయి. ఇక్కడ పొలంలో పనిచేస్తే సాయంత్రానికి శరీరమంతా మంటలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడి ఈ పొలాల్లో పనిచేసేందుకు ఎవరు రావడం లేదు. ఇక్కడ ఫ్యాక్టరీల నుంచి వచ్చే వ్యర్థాలు నీటిలో కలవడంతో ఈ నీటిని తాగిన జీవాలు, పశుశులు గర్భస్రావానికి గురవుతున్నాయి. రైతులు ఈ వైపుకు పశువులను రానివ్వడం లేదు. జీవాలు పెంచుకునే వారు ఈ గ్రామం నుంచే వలస వెళ్లిపోయారు. ఇంతటి దయనీయ స్థితిని ఎదుర్కొంటున్న ఏ ఒక్కరూ స్పందించడం లేదు. ఖమ్మంజిల్లా నేలకొండపల్లి మండలం అప్పలనర్సింహాపురం రైతుల దయనీయ ధీనగాధ ఇది.

-ప్రజాపక్షం/ఖమ్మం

2 లో

-ఒకే రోజు 42 ఇండ్లు రికార్డుల్లో నమోదు
-కోటి రూపాయలు చేతులు మారాయని ఆరోపణలు
-ఇల్లు లేకుండానే ఇంటి నెంబర్లు



# కాసులిస్తే చాలు.. చిటికెలో పని..!



### -పంచాయతీ కార్యదర్శా మజాకా

**ప్రజాపక్షం/ఖమ్మం :** కాసులిస్తే సారు దగ్గర కాని పనే లేదు. ఆ పంచాయతీ పరిధిలో ఏ పని కావాలన్న ఆయనకు సమర్పించుకుంటే చాలు చిటికెలో పని చేస్తారు. అంతే కాదు ఆయనకు జిల్లా పంచాయతీ అధికార యంత్రాంగం యావత్ సహకరిస్తుంది. ఆయన ఫైలుకు, ఆయన మాటకు తిరుగుండదు. ఒకేరోజు 42 ఇండ్లకు ఇంటి నెంబర్లు కేటాయించడంతో పాటు లేని ఇండ్లకు కూడా ఇంటి నెంబర్లు ఇచ్చి ఓ రికార్డు సృష్టించాడు. కనీస పరిశీలన లేకుండా ప్రభుత్వ నియమ నిబంధనలను పక్కన పెట్టి ఇష్టానుసారంగా వ్యవహరించిన ఈ ఘటన ఖమ్మం రూరల్ మండలం చిన్నవెంకటగిరిలో చోటు చేసుకుంది. గ్రామ పంచాయతీలో ఇంటి నెంబర్ తీసుకోవాలంటే స్థలం కాగితాలు, ఈసి, భవనానికి తీసుకున్న అనుమతులు, భవన నిర్మాణ

మిగతా 2లో..

## మద్దులపల్లి మార్కెట్‌ను సందర్శించిన మంత్రి పొంగులేటి



2 లో

## ప్రజలకు ఏ కష్టమొచ్చినా గుర్తొచ్చేది ఎర్రజెండానే..




సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

2 లో

# రైతుల జీవితాలను కమ్మేస్తున్న పొగ






**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆంధ్రా సరిహద్దుకు దగ్గరలో భద్రాద్రి స్పాంజ్ ఐరన్ పేరిట 20 ఏళ్ల క్రితం ఓ కర్మాగారాన్ని నిర్మించారు. అప్పట్లో ఈ ప్రాంతంలో దొరికే ఐరన్‌వోర్‌తో స్పాంజ్ ఐరన్ తయారు చేసేవారు. ఈ ప్రాంత రైతులు ఆందోళన చేస్తే పంట పండిన పండకపోయినా కౌలు ఇస్తామంటూ హామీ ఇచ్చి కొంత కాలం కౌలు చెల్లించారు. ఏదో కారణాలతో ఫ్యాక్టరీ మూతపడింది. రెండేళ్ల క్రితం కర్మాగారాన్ని మరింత విస్తరించి పునః ప్రారంభించారు. బళ్లారి ప్రాంతం నుంచి ముడి సరుకు తెచ్చి కర్మాగారాన్ని నడుపుతున్నారు. ఈ కర్మాగారం నుంచి వెలువడే పొగ చుట్టూ మూడు కిలో మీటర్ల దూరం వ్యాపించి పంటలను సర్వ నాశనం చేస్తుంది. పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలను ఈ ప్రాంతంలో సాగు చేస్తుండగా ఆ పంటలు పచ్చదనాన్ని కోల్పోయి మసిబారి కనిపిస్తున్నాయి. ఎదుగు బొదుగు లేకుండా దిగుబడి రాక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండిన కొద్దిగైనా మార్కెట్‌లో ధర లేక ఎంతకు అడిగితే అంతకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఇక్కడి రైతులకు దాపురించింది.

### కూలీలు రావడం లేదు...

పొగబారిన వ్యవసాయ భూముల్లో మిర్చి కోసేందుకు పత్తి తీసేందుకు లేదా ఇతర వ్యవసాయ పనులకు కూలీలు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొగబారిన మొక్కలను తాకితే చేతులు దురదలు వస్తున్నాయని, శరీరమంతా మంటలు, రాత్రిపూట శ్వాస తీసుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కూలీలు రావడం లేదు. అప్పల నర్సింహాపురం ప్రాంతంతో పాటు చుట్టు పక్కల గ్రామాల వారు కూడా ఈ వైపుకు వచ్చేందుకు జంకుతున్నారంటే అతిశయోక్తి కాదు. పత్తి, మిర్చి నల్లబారడంతో సగం ధరకు మాత్రమే అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. ఓ గిరిజన రైతు ఎకరం రూ. 30వేల చొప్పున రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేస్తే కూలీలు రాక కుటుంబ సభ్యులే నెల రోజులుగా మిర్చి కోసుకుంటున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అవగతమవుతుంది. పండిన పంటలను సైతం మసిబారి నాణ్యత కోల్పోవడంతో సగం ధరకే అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. ఈ ఫ్యాక్టరీ బాధిత రైతుల్లో చిన్న సన్నకారు రైతులే ఎక్కువ.

### మాయమవుతున్న నెమళ్లు ...

అప్పలనర్సింహాపురం ఆంధ్రా ప్రాంతానికి సరిహద్దున ఉంటుంది. గుట్టలు, అలరాడే పచ్చదనంతో ఉండి సాయంత్రం పూట నెమళ్లు వ్యవసాయ భూముల్లో, పచ్చిక మైదానాల్లో నాట్యం చేసేవి. రెండేళ్ల క్రితం వరకు పచ్చని సౌందర్యాన్ని, నెమళ్ల ఆటలను చూసిన ఈ ప్రాంత ప్రజలకు ఇప్పుడు ఆ దృశ్యాలు కనిపించడం లేదు. పొగబారిన మొక్కలు, చెట్లు కనిపిస్తుండగా నెమళ్లు, ఇతర అటవీ పక్షులు, జంతువులు కనుమరుగయ్యాయి. నల్ల రంగు పులుముకున్న చెట్లు తప్ప పచ్చని ఆకులు ఉన్న మొక్కలు లేవంటే నమ్మాల్సిందే.

### పుండు మీద కారంలా కెమికల్ ఫ్యాక్టరీ...

స్పాంజ్ ఐరన్ కర్మాగారానికి అత్యంత సమీపంలో కెమికల్ ఫ్యాక్టరీని నిర్మించారు. కెమికల్ ఫ్యాక్టరీ నుండి వచ్చే వ్యర్థాలను తీసుకుని వచ్చి ఈ ఫ్యాక్టరీలో శుద్ధిచేసి ఆంధ్రా ప్రాంతంలోని సిమెంట్ ఫ్యాక్టరీలకు సరఫరా చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ పనిచేస్తున్నప్పుడు విపరీతమైన దుర్గంధం వెలువడుతుంది. చుట్టు రెండు కిలో మీటర్ల మేర పొలాల్లో పనిచేస్తున్న రైతులు ఈ దుర్గంధాన్ని భరించాల్సిందే. ఈ దుర్గంధంతో రైతులు, వ్యవసాయ కూలీలు దీర్ఘ కాలిక వ్యాధులకు గురై ఆసుపత్రుల చుట్టు తిరుగుతున్నారు.

### రైతుల మొర ఆలకించేదెవరు ...

రెండేళ్లుగా రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పంటలు పోయి ప్రజలు అనారోగ్యాల బారీనపడటమే కాకుండా పర్యావరణానికి ముప్పుగా మారిన ఈ ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకునేందుకు ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాలతో పాటు హైదరాబాద్ పర్యావరణ అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు దరఖాస్తు చేసిన స్పందించిన నాథుడే లేడని రైతులు అంటున్నారు. ఈ ఫ్యాక్టరీలపై తగు చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని, పర్యావరణాన్ని పరి రక్షించాలని, భూమితో ముడిపడిన రైతులను తిరిగి సాగు చేసుకునేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మద్దులపల్లి మార్కెట్‌ను సందర్శించిన మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం మున్సిపాలిటీపరిధిలోని ముద్దులపల్లిలో గల వ్యవసాయమార్కెట్‌ను రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణం,సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం సందర్శించారు. పాలేరునియోజకవర్గ పర్యటనలో బాగంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కాగా మద్దులపల్లిమార్కెట్ రెండోరోజు భద్రమ్మ అనే రైతు 55బస్తాల మిర్చి తీసుకురాగా క్వింటాకు రూ.13,811 ధర పలికింది. తమ పంటను అమ్మాటానికి తీసుకువచ్చిన రైతులను మార్కెట్ కమిటీ చైర్మన్ భైరు హరినాథ్‌బాబు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు బాలసాని లక్ష్మినారాయణ, తుళ్లూరి బ్రహ్మయ్య, ఆత్మకమిటి చైర్మన్ చావా శివరామకృష్ణ, మార్కెట్ డైరెక్టర్లు కర్లపూడి భద్రకాళి, ఉప్పుగండ్ల ప్రసాద్, వంసరి రవి, డీఎంఓ అలాం, డీఈఈ ఎల్లేష్, కార్యదర్శి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఏ కష్టమొచ్చినా గుర్తొచ్చేది ఎర్రజెండానే..



**ప్రజాపక్షం/పాల్వంచ :** రాజ్యాంగంపై, ప్రజాస్వామ్యంపై గౌరవంలేని పాలకుల చేతిలో దేశం మగ్గుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని వాసవి బాంకెట్ హాల్‌లో సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ..ప్రతిపక్ష పాలిత ప్రభుత్వాలను కూల్చేసే పనిలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఉందని, అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తున్నారని, అందులో భాగంగానే అక్రమ కేసులు పెట్టి సీబీఐ, ఈడీ ద్వారా దాడులు జరుపుతూ ప్రతి పక్షాలను భయపెడుతున్నారని విమర్శించారు. మావోయిస్టులను మార్చ్ వరకు లేకుండా చేస్తామని అమిత్ షా ప్రకటన వెనక ఆంతర్యం ఏంటి అని, ప్రశ్నించే గొంతుకులను నలిపివేయటమే బీజేపీ ఎజెండాగా పెట్టుకుందని విమర్శించారు. పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సీపీఐ అని, సుదీర్ఘ పోరాటాలుచ త్యాగాలతో నిర్మితమైన ఎర్రజెండా పార్టీకి ఎదురులేదని, ప్రజలకు ఏ కష్టమొచ్చినా గుర్తొచ్చేది ఎర్రజెండానేని అన్నారు. సమ సమాజ స్థాపనసోసిలిస్టు రాజ్యసాధనే కమ్యూనిస్టుల లక్ష్యం అని, అందుకోసం ఎటువంటి త్యాగాలకైనా వెనకాల పోమని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సీపీఐ సిద్ధంగా ఉందని, పొత్తులు, సర్దుబాట్లు ఎన్నికలు వచ్చినప్పుడు నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రతి పంచాయితీలో సీపీఐకి ప్రాతినిధ్యం వచ్చే విధంగా కార్యకర్తలు, నాయకులు కార్యచరణ రూపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే జిల్లా వ్యాప్తంగా సీపీఐ శత వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించాలని, శత వసంతాల వేడుకలతో పార్టీ ప్రజా సంఘాలను మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, సర్‌రెడ్డి పుల్లారెడ్డి, ఎస్‌డి సలీం, కె.సారయ్య, కల్లూరి వెంకటేశ్వరరావు, కమటం వెంకటేశ్వర్లు, మున్నా లక్ష్మికుమారి, నారాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, రేసు పుల్లయ్య, దేవరకొండ శంకర్, పట్టణ, మండల కార్యదర్శులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, వాసిరెడ్డి మురళీ, భూక్యా దస్రు, బంధం నాగయ్య, గుగులోత్ రామ్‌చందర్, డి.సుధాకర్, జి.రామకృష్ణ, సతీష్, కేశవ రావు, నారాయణ, యూసుఫ్, ధర్మ, కృష్ణ, జిల్లా సమితి సభ్యులు, ప్రజా సంఘాల జిల్లా బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టానుసారంగా వ్యవహరిస్తే వేటు తప్పదు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్‌లో రూల్స్‌ను అతిక్రమించి ఇష్టరీతిన వ్యవహరిస్తే వేటు తప్పదని కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ప్రజలకు సమర్థవంతమైన పరిపాలనతో మెరుగైన సేవలను అందించాలన్నారు. కార్పోరేషన్ పరిధిలో రోడ్లు నాణ్యత లేకుండా ఉన్నాయని కొత్త రోడ్లు కూడా త్వరగా పాడవుతున్నాయని, నూతనంగా నిర్మించే రోడ్లు నాణ్యత పరీక్షించే వరకు బిల్లులు చెల్లించవద్దని కలెక్టర్ సూచించారు. గురువారం ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ కార్యకలాపాలపై కార్పోరేషన్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్, ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ డా॥ పి.శ్రీజతో కలిసి అధికారులతో సమీక్షించారు. పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ విధానం, ఖాళీ స్థలాలు, నీటి సరఫరా, ప్రణాళిక, టౌన్ ప్లానింగ్, పన్ను వసూలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి పలు అంశాలపై కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో చెత్త పేరుకుపోతున్న 1248 ఖాళీ స్థలాలను గుర్తించడం జరిగిందని వీటిలో ఎన్ని శుభ్రం చేశామో వాస్తవిక వివరాలతో నివేదిక అందించాలన్నారు. ప్రైవేటు స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు మరోసారి అక్కడ చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు ఖాళీ స్థలాలకు ఫెన్సింగ్, ఇతర ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా స్థల యజమానులకు నోటీసులు జారీ చేయాలని నిర్లక్ష్యం వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో ముందుగా బేసిక్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. డంపింగ్ యార్డు వద్ద సిమెంటు రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్పోరేషన్ పరిధిలో ప్రతి రోజు చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేలా క్షేత్ర స్థాయి పరిశీలన చేసి 15 రోజుల్లో డివిజన్ల వారీగా ప్రణాళికలు సమర్పించాలన్నారు. మార్కెట్, జ్యూస్ షాపులు, హోటల్స్, నాన్‌వెజ్ దుకాణాలు, ఫంక్షన్ హాల్స్, వాణిజ్య కార్యకలాపాల నుంచి చెత్త సేకరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో బృందాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. రాబోయే వేసవి కాలంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని త్రాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, నీటి లీకేజీని అరికట్టాలని, పైపులైన్‌లో అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఫుట్ ఆక్రమణల తొలగింపుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. షాపింగ్ మాల్స్, వాణిజ్య సముదాయాలలో దివ్యాంగుల సౌకర్యార్థం ర్యాంపులను 15 రోజుల్లో ఏర్పాటు చేసేవిధంగా నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. వాణిజ్య వ్యాపారులు ఇష్టరీతిన రోడ్లపై ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారని అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ప్రింట్ చేసిన ప్రింటింగ్ ప్రెస్ యజమాన్యాలకు, వ్యాపారులకు భారీగా జరిమానా విధించాలని కలెక్టర్ తెలిపారు. కార్పోరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దుకాణాలు బయటకు రావడం వల్ల ట్రాఫిక్ సమస్య అధికమవుతుందని ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో రోడ్ల పైకి వచ్చిన దుకాణాల తొలగింపుకు నోటీసులు జారీ చేయాలన్నారు. నిర్మాణాలకు సంబంధించిన సామాగ్రిని రోడ్లపై వేస్తున్నారని ఎవరైనా వేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భారీ జరిమానాలను విధించాలని కలెక్టర్ తెలిపారు. అనుమతులు ఇచ్చే సమయంలో ఇట్టి విషయాలను దరఖాస్తుదారులకు తెలపాలన్నారు. ప్రజలకు సేవ చేసే భావన ఉంటేనే జిల్లాలో ఉండాలని రూల్స్‌ను అతిక్రమించి ఇష్టరీతిన వ్యవహరిస్తే వేటు తప్పదని కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తనకు పని కంటే ఎవరు ముఖ్యం కాదని కలెక్టర్ తెలిపారు. ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ డా॥ పి. శ్రీజ మాట్లాడుతూ గత సమీక్షలో తీసుకున్న నిర్ణయాల మేరకు ప్రతి డివిజన్‌కు పారిశుధ్య ప్రణాళిక, కార్పోరేషన్‌లో కంట్రోల్ రూము ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఖాళీ స్థలాల జాబితాను తయారు చేసి చెత్త వేయకుండా యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ షఫీవుల్లా, ఎస్‌ఈ రంజిత్, ఈఈ కృష్ణలాల్, ఏసిపి వసుంధర, ఉద్యాన వన శాఖాధికారిణి రాధిక, శానిటరి సూపర్‌వైజర్ సాంబయ్య, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఇంచార్జి డిసిపి రాజ్‌కుమార్, ట్రాఫిక్ ఎస్‌ఐ రవి,మెప్మా పిడి మహేందర్,టిఎంసిసుజాత, అధికారులు పాల్గొన్నారు.

# కాసులిస్తే చాలు..చిటికెలో పని..!

(మొదటిపేజీ తరువాయి)

ప్లాన్, వీటితో కలిపి దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. 2018 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పాత ఇండ్లకు కూడా ఇంటి నెంబర్లు కేటాయించే అవకాశం ఉంది. వారు స్థలం కొనుగోలు కాగితాలు, బిల్డింగ్ ప్లాన్, న్యాయవాది నోటరీ, ఈసి తో కలిసి దరఖాస్తు చేయాలి. ఇంటి నెంబర్ కొరకు మీ సేవలో దరఖాస్తు చేస్తే ఆ దరఖాస్తు గ్రామ పంచాయతీ కార్యదర్శికి చేరుతుంది. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆ దరఖాస్తుదారుని అసలు ధృవపత్రాలు పరిశీలించి గ్రామ పంచాయతీ నోటీస్ బోర్డులో అభ్యంతరాల కొరకు ఏడు రోజుల పాటు ఉంచాలి. ఎటువంటి అభ్యంతరాలు లేకపోతే అప్పుడు ఇంటి నెంబర్‌ను కేటాయించాలి. కానీ ఖమ్మం రూరల్ మండలం చిన్నవెంకటగిరిలో ఓ ప్రజాప్రతినిధితో కొసర బంధుత్వం కలుపుకుని 181 ఇండ్లకు ఇంటి నెంబర్లను కేటాయించారు. స్వయంగా ఇంటిని గ్రామ పంచాయతీ కార్యదర్శి పరిశీలించి ఇంటి పన్నును నిర్ణయించి నెంబరును కేటాయించాల్సి ఉంది. కానీ జనవరి నాలుగున 38 ఇండ్లకు ఒకే రోజు ఇంటి నెంబర్లు కేటాయించారు. ఆ తర్వాత ఐదవ తేదీన 21 ఇండ్లకు నెంబర్లు కేటాయించి గ్రామ పంచాయతీ రికార్డుల్లో పొందుపరిచారు. 29 డిసెంబర్ 2024న 44 ఇండ్లకు ఇంటి నెంబర్లను కేటాయించారు. గ్రామ పంచాయతీ రికార్డులో పొందుపర్చడంతో కొంత మంది రిజిస్ట్రేషన్ చేయించుకుని బ్యాంకుల ద్వారా రుణాలు కూడా పొందినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. 180 కొత్త ఇంటి నెంబర్లు కేటాయించడంతో పాటు మరో 40 ఇండ్లకు మ్యూటేషన్ చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో జిల్లా పంచాయతీ శాఖ ఉన్నతాధికారుల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో కోటి రూపాయలకు పైగా చేతులు మారినట్లు తెలుస్తుంది. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది. ఒక్క గ్రామ పంచాయతీలోనే ఇంత పెద్ద మొత్తంలో అవినీతి చోటు చేసుకుందంటే జిల్లాలో మిగిలిన గ్రామ పంచాయతీల్లో పరిస్థితి ఏవిధంగా అవగతమవుతుంది. ఎదులాపురం కేంద్రంగా కొత్త మున్సిపాలిటీ ఏర్పాటు కావడంతో మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం ఇంటి నెంబర్ల కేటాయింపుకు అధిక మొత్తం కేటాయించాల్సి వస్తుందని కొందరిని ప్రలోభపెట్టి ఈ భారీ అవినీతి కార్యక్రమానికి తెర లేపినట్లు సమాచారం. జిల్లా ఉన్నతాధికారులు ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని కోరుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘానికి నాయకునిగా ఉన్న వ్యక్తే ఇటువంటి అవినీతి పనులకు తెరలేపడం శోచనీయం.

# నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

**-పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించిన కలెక్టర్**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ , అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి మున్నేరు నది పరివాహాక ప్రాంతంలో పర్యటించి పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. ఈసందర్భంగా మంచికంటి నగర్, బొక్కలగడ్డ మున్నేరు నది ప్రాంతంలో కాలినడక నడిచి ఆ ప్రాంత నివాసితులతో శానిటేషన్, త్రాగునీరు, విద్యుత్, ఉపాధి పనులు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఖాళీ స్థలాలను పరిశీలించి చెత్త పేరుకుపోకుండా ఫెన్సింగ్ ఏర్పాటుకు సంబంధిత స్థల యజమానికి తెలియజేయాలని అసిస్టెంట్ కమిషనర్ షఫీవుల్లాను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి ప్రవాహానికి అంతరాయం లేకుండా కాలువలను శుభ్రం చేయాలన్నారు. డ్రైన్లకు ఉన్న మరమ్మతులను పూర్తి చేయాలని, సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని, ప్రతి ఇంటికి చెత్త సేకరణ బండి వచ్చేలా చూడాలని, మూడు బ్రిడ్జిల వద్ద చెత్త అధికంగా ఉందని వీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. మున్నేరు నది పరివాహక ప్రాంత మహిళలతో కలెక్టర్ మాట్లాడారు. మహిళా సంఘాలు చర్చించుకుని టైలరింగ్, వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని వాటి గ్రౌండింగ్‌కు రుణాలు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బాగా చూస్తున్నారా, వైద్యం అందుతుందా వంటి వివరాలను తెలుసుకున్నారు. ఓ మహిళ తన కూతురుకు కంటి సమస్య ఉందని తెలపగా సదరం క్యాంపులో చూపుకు సంబంధించి పరీక్షలు చేసి సర్టిఫికెట్ మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. గతంలో వరద బీభత్సం వచ్చిందని భవిష్యత్తులో వరద కష్టాలు పునరావృతం కావద్దంటే మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మించాలని దీని కోసం ఎవరి ఇండ్లను తీయాల్సి వచ్చినా నూతన ఇండ్లు అందించిన తర్వాత తొలగిస్తామని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తొలుత మున్నేరు నది వద్ద శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవస్థానం దగ్గర ఉన్న సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద పూజలు నిర్వహించారు. అక్కడ ఉన్న శివ సత్తులతో మాట్లాడారు. మున్నేరు వాగుకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ ఏర్పాటు చేస్తున్నామని అది పూర్తయిన తర్వాత గద్దెల వద్ద అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి సౌకర్యాల కొరకు చర్యలు చేపడతామన్నారు. ఇండ్లు లేని పేదలకు దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ షఫీవుల్లా, మున్సిపల్ అధికారులు, జవాన్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి

**-మహమ్మద్ మౌలానా**
**-ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు : దండి సురేష్**
**-ఘనంగా గ్రామ శాఖ మహాసభలు**





**ప్రజాపక్షం/కూసుమంచి :** మండలంలోని గైగోళ్ళపల్లి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) గైగోళ్ళపల్లి గ్రామ శాఖ మహాసభ బుధవారం సాయంత్రం పార్టీ జిల్లా సమితి సభ్యులు గుండె పంగు మల్లేష్ అధ్యక్షతన గైగోళ్ళపల్లి గ్రామంలోని (అమరజీవి సంగబత్తుల వెంకటరెడ్డి ప్రాంగణం) లో జరిగింది. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సీపీఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత మహాసభల ప్రారంభ సూచికగా పార్టీ అరుణ పతాకాన్ని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో వారు మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఉమ్మడి గైగోళ్లపల్లి గ్రామం నుండి ఎంపీటీసీ, సర్పంచ్ ల స్థానాలకు పోటీ చేసేందుకు సమాయత్తం కావాలని, కలిసివచ్చే పార్టీలతో పోటీ చేసి గెలుపొందాలని, అమర్ జీవి వెంకటరెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సమైక్య రాష్ట్ర అధ్యక్షులు రామ్మూర్తి నాయక్ మాట్లాడుతూ, బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ గ్రామ శాఖ కమిటీని 16 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య అధ్యక్షులు రామ్మూర్తి నాయక్, పార్టీ మండల కార్యదర్శి భూక్య నరసింహ, సహాయ కారదర్శి జిల్లా లింగయ్య, నాయకులు కత్రోజు పాండు రంగాచారి, సంగబత్తుల ఉపేందర్ రెడ్డి, సత్యం, అల్లి వెంకటేష్, జిల్లా నాగరాజు, శ్రీకాంత్, ప్రశాంత్, రైతు సంఘం నాయకులు రామ్ కోటి, జగన్, జిల్లా నాగరాజు, జిల్లా సైదులు, నరేష్ రెడ్డి, తేలు వెంకన్న, తురక వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# వేతనాల కోసం మోకాళ్లపై నిరసన




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి ముందు వేతనాల కోసం మోకాళ్లపై నిరసన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దండు ఆదినారాయణ మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం మరియు కాంట్రాక్టర్ కు చలనం లేదని జనవరి నెలలో సమ్మె నోటీస్ ఇచ్చిన కూడా రెండవ నెలలు స్పందన లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత వారం రోజులుగా పలు విధాలుగా రోజువారి కార్యక్రమంలో భాగంగా వేతనాల కోసం నిరసన చేస్తూ ఆందోళన కార్యక్రమం చేస్తున్నా స్పందన లేకపోవడంతో ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డులు ఇబ్బందులు పడుతున్నారని గత ఏడు నెలల క్రితం సమ్మె నోటీస్ ఇస్తే వేతనాలు వేశారని మళ్ళీ సమ్మె నోటీస్ జనవరి నెలలో ఇచ్చామని నాలుగు నెలలుగా కార్మికుల జీతా లు ఇవ్వడంలో కాంట్రాక్టర్ మరియు ప్రభుత్వ అధికారులు, నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. గత వారం రోజులుగా ప్రతిరోజు ఒక గంట నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఆసుపత్రి అధికారికి వినతి పత్రం సమర్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, సత్తుపల్లి డివిజన్ మహిళా సమైక్య కన్వీనర్ షేక్ రంజాన్ బి, ఏఐటీయూసీ మండల నాయకులు దామాల దయాకర్ రావు, ఆసుపత్రి కార్మికులు వంశీ, ప్రమోద్, నాగమణి, కోటేశ్వరి, సరోజినీ, జాన్ బి పాల్గొన్నారు.

# అంతర్గత మార్కుల మూల్యాంకనం పరిశీలన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెం మండలంలోని పలు పాఠశాలల్లో పదవ తరగతి అంతర్గత మార్కుల మూల్యాంకనాన్ని పరిశీలించారు. గురువారం మండల పరిధిలోని కెజిబివి పాఠశాల, దానవాయిగూడెం, మహాత్మ జ్యోతిబాయి పూలే, బిసి ఉన్నత పాఠశాలలో మంచుకొండ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఆర్. కరుణకుమారి బృందం సందర్శించి అంతర్గత మార్కుల మూల్యాంకనాన్ని పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులకు గతంలో నిర్వహించిన ఫార్మెటివ్ మూల్యాంకనం మార్కులు, నోటు పుస్తకాలు, రికార్డులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మూల్యాంకనం, రికార్డులు సరిగ్గా నిర్వహించినందుకు బృందం సంతృప్తి వ్యక్తం చేసి ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించి పరీక్షల్లో ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి, ఎక్కువ మార్కులు ఎలా సాధించాలో సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బృందంలోని ఉపాధ్యాయులు జూకంటి సుజాత, షేక్ రంజాన్ అలీ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన కమ్మ సంఘం నూతన కమిటీ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన కమ్మ మహాజన సంఘం నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించింది. గురువారం సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీ ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం బాధ్యతలు స్వీకరించారు. సంఘం చేపట్టబోయే కార్యక్రమాల గురించి చర్చించారు. అందరి సహకారంతో కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కొల్లు రఘు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చావా రాము, ఉపాధ్యక్షులు కర్నాటి రమాదేవి, జాయింట్ సెక్రటరీ వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తాళ్లూరి నిర్మల, కార్యవర్గ సభ్యులు మోత్కూరి సత్యనారాయణ, పోతినేని భూమేశ్వరరావు, మేదరమెట్ల స్వరూపరాణి, నల్లమల ఆనంద్, నంబూరి ప్రసాద్, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, కోలేటి నవీన్, సంఘం మాజీ అధ్యక్షులు వెజళ్ల సురేష్, తాళ్లూరి మురళీకృష్ణ, బండి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# స్కూటీ గ్యారెంటీపై పోస్టు కార్డు ఉద్యమం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంలో పలు ప్రాంతాల్లో కాలేజీ విద్యార్థినిలు స్కూటీ గ్యారెంటీపై పోస్టు కార్డు ఉద్యమాన్ని గురువారం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన స్కూటీ గ్యారెంటీని ఇప్పటి వరకు అమలు చేయలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం 18 ఏళ్లు పైబడిన యువతులకు ఉచిత స్కూటీ అందిస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు గడుస్తున్నా ఈ హామీపై ఎలాంటి ప్రకటన లేకపోవడంతో కాలేజీ విద్యార్థినిలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిరసనలో భాగంగా ప్రధాన పోస్టాఫీసులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద విద్యార్థినిలు పోస్టు కార్డులు పంపిస్తూ తమ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం స్కూటీ హామీని అమలు చేయాలని లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని విద్యార్థినిలు హెచ్చరించారు. స్కూటీ గ్యారెంటీ అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# అన్నం ఫౌండేషన్‌కు రూ. 5లక్షల సామగ్రి వితరణ




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రిలయబుల్ ట్రస్టు హైదరాబాద్ ఆధ్వర్యంలో అన్నం సేవా ఫౌండేషన్‌కు ఐదు లక్షల రూపాయల విలువ చేసే నిత్యావసరాలను వితరణగా అందించారు. గురువారం అన్నం ఫౌండేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఖమ్మంజిల్లా జడ్జి చంద్రశేఖర్ చేతుల మీదుగా ఐదు లక్షల రూపాయల విలువ చేసే బియ్యం, ఆహార పదార్థాలు, దుస్తులు, ఇతర వస్తువులను రిలయబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ రవి, డా॥ టివి పుల్లంరాజు, బాలస్వామి, అల్వాల రామనాథం, పరిపూర్ణాచారి, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అన్నం ఫౌండేషన్‌లో మధురానగర్ సాయిబాబా ఆలయ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

# అక్రమ విగ్రహా నిర్మాణంపై అధికారులకు వినతి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ పట్టణంలోని రింగ్ రోడ్డు సెంటర్లో ఎలాంటి అనమతి లేకుండా బిజెపి నాయకులు నిర్మిస్తున్న విగ్రహాలను తొలగించాలని తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ తరుపున తహశీల్దారర్, ఎంపిడిఓ, ఇఓ, తల్లాడ ఎస్సైకి, ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాపా సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కటికి కిరణ్‌కుమార్, రాయల రాము, యూత్ ఉపాధ్యక్షులు వారాల అజయ్, షేక్.జమాల్, నర్సింహారావు, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మా భూములను కాపాడండి సారూ...



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని అప్ప లనరసింహాపురం లో ఐరన్ ఫ్యాక్టరీ వలన వ్యవసాయ సాగుకు భూములు పనికి రాకుండా పోతున్నాయని రైతులు వాపో యారు. గ్రామానికి చెందిన బాధిత రైతులు గురువారం హైదరాబాద్ లోని కాలుష్య నియంత్రణ మండలి అధికారు లను కలిసి ఫ్యాక్టరీ పై ఫిర్యాదు చేశారు. ఫ్యాక్టరీ వలన రైతులు పడుతున్న బాధలను అధి కారులకు వివరించారు. విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని బాధిత రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు మాట్లాడారు. ఫ్యాక్టరీ వలన పంటలు దెబ్బతింటున్నాయని వాపోయారు. పలుమార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకో వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు వ్యవసాయం సాగు చేయకుండా భూములు వదిలేసే పరిస్థితులు నెలకొల్పుతున్నారని అన్నారు. తమకు న్యాయం చేయకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అధికారులను కలిసిన వారిలో బాధిత రైతులు అంజి బాబు, వెంకటనారాయణ, శ్రీనివాస రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కూలీలతో ఉన్న ఆటోను ఢీ కొన్న ట్రాక్టర్

### -ఒకరి మృతి... ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు




ప్రజాపక్షం/పెనుబల్లిః పెనుబల్లి మండలంలో గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. కూలీలతో వెళుతున్న ఆటోని ట్రాక్టర్ ఢీ కొట్టడంతో ఒక యువకుడు దుర్మ రణం పాలవగా ఇద్దరు మహిళలకు తీవ్ర గా యాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... పెనుబల్లి మండలం కందిమల్ల వారి బంజర గ్రామానికి చెందిన 13 మంది కూలీలు పొట్టకూటి కోసం మొక్కజొన్న పిలకలు తొలగించేందుకు ఉదయాన్నే చిన్నమ్మ గూడెం మీదుగా చంద్రు గొండ కు బయలుదేరారు. బయ్యన్నగూడెం గ్రామ పరిధిలోని నాయకులగూడెం గ్రామ సమీపంలో ఎదురుగా కంకర లోడుతో వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమా దంలో ఆటోలో ఉన్న తుమ్మలపల్లి మురళి, బత్తుల వెంకమ్మ, కంపా మారమ్మ లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రులను పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో ఆటోలో 13 మంది కూలీలు ప్రయాణిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన తుమ్మలపల్లి మురళి (25)ఆసుపత్రికి చేరుకున్న కొద్దిసేపటికే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు తండ్రి రెండు నెలల క్రితం గుండెపోటుతో మరణించాడు. తండ్రి చనిపోవడంతో తల్లి విజయ కుమారిని, మతి స్థిమితం సరిగా లేని సోదరుడు రామకృష్ణ లను కూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భర్తను కోల్పోయిన రెండు నెలలకే తల్లికి, మతిస్థిమితం లేని రామకృష్ణకు ఆసరాగా ఉంటాడ నుకున్న పెద్ద కొడుకు రోడ్డు ప్రమాదంలో కళ్ళ ఎదుటే మృత్యువు కబళించడంతో మృతుడు తల్లి విజయ్ కుమారి గుండెలు పగిలేలా రోదించడం చూపురలను కలచి వేసింది.

## విశ్రాంత ఉపాధ్యాయులు రాచమళ్ళ మృతి



ప్రజాపక్షం/సత్తుపల్లిః విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు, మండల పరి ధిలోని గంగారం గ్రామ మాజీ సర్పంచ్ రాచమళ్ళ కృష్ణమూర్తి గురువారం అనారోగ్యంతో మృతి చెందారు.ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వివిధ పాఠశాలలలో ఆయన ప్రభుత్వ ఉపాధ్యా యునిగా పని చేశారు. ఉద్యోగంలో చేరకముందు గంగారం గ్రామ పంచా యతీ సర్పంచ్‌గా పనిచేశారు. ఉద్యోగ విరమణ తరువాత ప్రజాసేవా కార్య క్రమాలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘంలో చురుకుగా పనిచేశారు. గురువారం తెలంగాణ రాష్ట్రప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాచమళ్ళ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేసి భౌతిక కాయానికి నివాళ్ళులర్పించారు. యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవరెడ్డి, బద్రుద్దీన్ లతో పాటు నాయకులు సాంబశివరెడ్డి, జి.కృష్ణయ్య, బోడేపూడి బాబు, పిడి.రాజు, మధుసూదన రాజు తదితరులు సంతాపం తెలిపారు.

## కస్తూరిబాకు వెళ్లే దారిలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

ప్రజాపక్షం/జూలూరుపాడుః కస్తూరిబా పాఠశాలకు వెళ్ళేందుకు రాత్రి అయితే చాలు అటువైపు వెళ్ళాలంటే సిబ్బంది మరియు విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని, తక్షణమే వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ డిమాండ్ చేవారు. గురువారం ఏఐఎస్ఎఫ్ మండలంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా సహాయ కార్యదర్శి వంశీ పాల్గొని మాట్లాడుతూ జూలూరుపాడు మండల కేంద్రంలో ఉన్న కస్తూరి బాలికల విద్యాలయానికి సాయంత్రం అయితే చాలు వెళ్లడానికి భయాందోళన గురవుతున్నారని వంశీ అన్నారు. కస్తూరిబా బాలికల విద్యాలయం మండల కేంద్రం నుంచి దాదాపు ఒక కిలోమీటర్ దూరంలో రాత్రి సమయంలో వీధిలైట్లు ఉండకపోవడం వల్ల సిబ్బంది గానీ ఏమైనా మెడికల్ ఎమర్జెన్సీకి ఎవరైనా వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. ప్పటికైనా ఉన్నత అధికారులు, రాష్ట్ర యంత్రాంగం స్పందించి రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ విద్యార్థుల పక్షాన అనేక పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బాలాజీ, శివ అనిల్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కౌలుకు తీసుకున్న భూమి ఆక్రమణ..!

**-కాకరవాయి, ముజాతిపురం రెవెన్యూ పరిధిలో ఘటన**
**-స్థల పరిశీలనకు వచ్చి చేతులు దులుపుకున్న అధికారులు**




ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : మనిషి బ్రతికున్నప్పుడు గ్రామస్తు లందరికీ సహాయ సహకారాలు అందిస్తూ ఉన్న వ్యక్తి ఏడు నూతల మాణిక్యరావు జీవితం ఎంతో ఆదర్శంగా ఉండేది. మాణిక్యరావు మర ణానంతరం ఆ కుటుంబం కడు పేదరికంలోకి వెళ్ళింది. వివరాల్లోకెళ్తే కాకరవాయి గ్రామానికి చెందిన మాణిక్యరావు జయలక్ష్మి దంపతులకు పదిమంది ఆడ సంతానం కాగా మాణిక్యరావు పుట్టుకతోనే వందల ఎక రాల భూస్వామి నిత్యం సిరి సంపదలతో పాడిపశులతో పదుల సంఖ్య పనిమనుషులతో కలకలలాడే ఇల్లు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఒక మగ సంతానం లేకపోవడంతో ఆ ఇల్లు ఆస్తులు మొత్తం అన్యక్రాం తానికి గురి అయ్యాయని కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. ఏడు నూతల మాణిక్యరావు జయలక్ష్మి దంపతులకు పదిమంది ఆడ సంతానం కాగా ముగ్గురు మరణించగా ఏడుగురు జీవించి ఉన్నారు. వారిలో కృష్ణకుమారి, రాజ్యలక్ష్మి, ఉషారాణి, పద్మజ, శ్రీదేవి, కళ్యాణి, ప్రేమలత, ఉండగా వీరి పెళ్లిళ్ల కోసం తండ్రి మాణిక్యరావు భూమిని కొంత భాగం విక్రయించి వివాహం జరిపించారు. కొంతకాలం తర్వాత ఆయన వయోభారంతో ఇద్దరు దంపతులు కూతుళ్ళ వద్దకు వెళ్లిపోవ డంతో అసలు సమస్య మొదలైంది. ఇదే అదునుగా భావించిన అక్కడి గ్రామస్తులు కొందరు మాణిక్యరావు దగ్గర భూమిని కౌలుకు చేసుకునే వారు మాణిక్యరావు మాకు భూమి విక్రయించినట్టు దొంగ కాగితాలు సృష్టించి ఫోర్జరీ సంతకాలతో రెవెన్యూ అధికారులను వివిధ రకాలుగా ప్రలోభ పెట్టి కొంత భూమిని పట్టా చేయించుకోగా మాణిక్యరావు పేరు మీద కాకరవాయి ముజాయితీపురం రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 11/ఆ 12 /ఆ 13/ఈ 155 సర్వే నెంబర్లు సుమారు మూడు ఎకరాల 27 కుంటల భూమి మిగిలి ఉండగా అట్టి భూమిపై అదే గ్రామస్తులు దౌర్జన్యంగా ఆక్రమించుకొని మీ భూమి లేదని మాణిక్యరావు కూతుర్లతో చెప్పడంతో వారి న్యాయపోరాటానికి తెర లేపారు. సుమారు రెండు సంవత్సరాల నుంచి తమ తండ్రిగారి భూమి మాకు చెందుతుందని రెవెన్యూ ఆఫీసు చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో అప్పటి తాహ సిల్దార్ రాంప్రసాద్ రెవిన్యూ ఇన్స్పెక్టర్లు సర్వేర్లు మాణిక్యరావు భూమిని పరిశీలించి ఆక్రమణలో ఉన్న మాణిక్యరావు భూమి అతని కూతుళ్లకు చెందుతుందని నిర్ధారించారు. రెవెన్యూ అధికారులు నిర్ధారించి రెండు సంవత్సరాల అవుతున్న భూమా ఆక్రమణదారులు భూమిని అప్పగించ పోకపోవడంతో న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. వెంటనే ఆ భూమిని ప్రస్తుత రెవెన్యూ అధికారులు సర్వే చేయించి వారికి అప్పగించాలని వారు కోరుతున్నారు.

# ఐదు నెలలుగా వేతనాల్లేవ్..!

**అవస్థలు పడుతున్న ఈ-పంచాయతీ ఆపరేటర్లు**

ప్రజాపక్షం/చింతకాని : గ్రామ పంచాయతీల్లో ప్రజలకు సేవలంది స్తున్న ఈ పంచాయతీ ఆపరేటర్లకు ఐదు నెలలుగా వేతనాలు రావడం లేదు.జిల్లా వ్యాప్తంగా... మంది పని చేస్తున్నారు. వీరికి నెలకు రూ.22750 వేతనం ఉంది. జీతాలు సక్రమంగా రాక ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. కంప్యూటర్లు ఉన్న పంచాయతీలతో పాటు మండల పరిషత్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తూ జననమరణ ధృవీకరణ,ఇతర పత్రాలు అందిస్తారు. నిత్యం మండల పరిషత్ కార్యా లయాల్లో ప్రభుత్వ అభివృద్ధి సంక్షమ కార్యక్రమాల వివరాలు కంప్యూ టరీకరిస్తున్నారు. ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తుం డగా .. వీరు ఓటర్ల జాబితా తయారీ, మార్పులు, చేర్పులు , తొలగిం పులు చేపడుతున్నారు. కేంద్రం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీల ఖాతాల్లోనే జమకాగానే..ఇందులో నుంచే ఆపరే టర్లకు వేతనాలు చెల్లించే వారు. కొన్నాళ్లుగా ఇవి నిలిచిపోవడంతో వేత నాలు చెల్లించే పరిస్థితి లేదు. జిల్లాకు35 కోట్లు రావాల్సి ఉంది. కొన్ని పంచాయతీల్లో సాధారణ నిధుల నుంచి వేతనాలు చెల్లించగా.. ప్రస్తుతం అవి కూడా లేవు.

**అప్పులు చేస్తున్నాం : గోజే సుమంత్ ఆపరేటర్**
**(రామకృష్ణాపురం క్లస్టర్ ,చింతకాని)**



ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పనిచే స్తున్నాం. ఉన్నతాధికారులు ఏ పని అప్పగిం చినా రాత్రనక, పగలనక కష్టపడుతున్నాం. వేతనాలు రాక కుటుంబ జీవనానికి అప్పులు చేయాల్సి వస్తోంది.పిల్లల ఫీజులు, ఆసుప త్రుల ఖర్చులకు చాలా ఇబ్బందులు ఎదుర్కొం టున్నాం. ప్రతినెలా 5వ తేదీ లోపు వేతనాలు బ్యాంకు ఖాతాల్లో వేసేలా చొరవ చూపాలి.

**కుటుంబ పోషణ భారంగా మారింది : గుర్రం చెన్నారావు**
**(ఈ ఆపరేటర్ల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు)**



ఆపరేటర్లకు పని ఒత్తిడి పెరిగింది. ప్రభుత్వ పథకాల ఆన్‌లైన్ ప్రక్రియ చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాం . ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ల జాబితా తయారీలో నిమగ్న మయ్యాం. ఐదు నెలలుగా వేతనాలు లేక కుటుంబ పోషణ భారంగా మారింది. తక్షణమే పెండింగ్ వేతనాలు ఇవ్వాలి.

# చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

**న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ**



ప్రజాపక్షం/జూలూరుపాడుః ఆరు గ్యారంటీల అమలుకై, ప్రజా సమ స్యల పరిష్కారం కొరకు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకై సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ నెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ జూలూరుపాడు బస్టాండ్ సెంటర్లో గురువారం పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ ఎంఎల్ న్యూడె మోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామయ్య, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ కే ఉమర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా ఇంటింటా సౌభాగ్యం ఇందిరమ్మ ఇల్లు అంటూ హామీలు ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వలేదని, పెరిగిన పెన్షన్లు ఇవ్వలేదని, అర్హులైన పేదవారికి రేషన్ కార్డులు ఇవ్వలేదని, రైతు భరోసా, రైతు బంధు, గృహ లక్ష్మి , మహాలక్ష్మి అనేక పథకాలు పెట్టి ఒక్క పథకాన్ని కూడా అమలు చేయాలని వారు అన్నారు. కాంట్రాక్ట్, ఔర్ సోర్సింగ్ కార్మికులను పర్మి నెంట్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని ప్రగల్బాలు పలికిన ఈ ప్రభుత్వాలు ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని వారు గుర్తు చేశారు. ఎన్నికల ముందు 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా పరిష్కరించలేదని ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించిందన్నారు. ఈ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జూలూరుపాడు మండల కార్యదర్శి వల్లో జుల రమేష్, వెంకయ్య, వెంకటేశ్వర్లు, మాధవరావు, రమేష్, రాజు తది తరులు పాల్గొన్నారు.

# శత సం‘పన్నులు’..!

**-ఏడు గ్రామాల్లో నూరు శాతం**
**-జిల్లాలోనే ముదిగొండ ముందంజ**
**-పన్నుల వసూళ్లలో ఆదర్శం**



ప్రజాపక్షం/ముదిగొండ : పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అన్న నానుడి ఆ గ్రామాల ప్రజలు అక్షరాల నిజం చేస్తున్నారు. ప్రతి పనికి ప్రభు త్వంపై ఆధారపడకుండా గ్రామాలు స్వయం సంవృద్ధి సాధించాలంటే పన్నులు వసూలు చేయటం తప్పనిసరి. ఇదే నానుడి అచ్చంగా పాటిస్తూ అధికారులు చెబుతున్న మాటలను ఆచరణలో పెడుతూ, అన్ని రకాల పన్నులు చెల్లించేందుకు ఆ గ్రామస్థులు ముందుకు వచ్చారు. దీంతో ఆయా గ్రామాల్లో నూరు శాతం పన్నులు వసూళ్ళతో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయి. వివరాల్లోకి వెళితే, ముది గొండ మండలం లో ఉన్న 25 పంచాయతీల్లో ఏడు పంచాయతీలు పోటీ పడి వంద శాతం పన్నులు వసూలు చేసి ఇతర గ్రామాలకు ఆద ర్శంగా నిలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో సాదించిన పన్నుల ప్రగతిపై ప్రజాపక్షం ప్రత్యేక కథనం మండల పరిధిలోని మల్లన్న పాలెం, పమ్మి, ఖానాపరం, వల్లాపురం, కట్టకూరు, అమ్మపేట, లక్ష్మి పురం పంచాయతీలు 202425 సంవత్సరం లో ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేస్తూ ఇతర గ్రామాలకు దిక్సూచిగా నిలిచాయి. గ్రామ పంచాయతీలకు ప్రోత్సహకాలు దక్కాలంటే వంద శాతం లక్ష్యా లను చేదించాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ఆ గ్రామ పంచాయతీలు పన్నులు వసూలుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. మండల పంచా యతీ అధికారి వాల్మీకి కిషోర్ ఆధ్వర్యంలో 25 పంచాయతీల కార్యద ర్శులు గ్రామాల్లో పన్నుల వసూళ్లపై దృష్టి సారించారు. వీరితో పాటు పంచాయతీ సిబ్బందిని కూడా నియమించారు. దీంతో పన్నులు చెల్లిం చని మొండి బకాయిలపై కార్యదర్శులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారిం చారు. పంచాయతీ సిబ్బంది పన్నులు చెల్లించే వరకు వారి ఇంటి వద్దనే బైటాయిస్తూ, వసూలు చేపడుతున్నారు. మండలం లో పలు గ్రామ పంచాయతీలు వంద శాతం పన్నులు వసూలు చేయాలని లక్ష్యంలో నిమగ్నమయ్యాయి. తెల్ల వారితే చాలు సిబ్బందితో పన్నులు వసూళ్ళు చేపడుతూ నూరు శాతం వసూలు దిశగా సాగుతున్నారు. అధికారు లతో పాటు ఆయా గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు కూడ ప్రత్యేక శ్రద్ధ తీసు కోవడంతో వసూళ్ళలో పురోగతి లభించింది. ఇంటి పన్నులు చెల్లిస్తే కలిగే ప్రయోజనాలను అధికారులు ప్రజలకు వివరిస్తున్నారు.

**పన్నుల వసూళ్లలో జిల్లాలోనే ముందంజ ...**



పన్నుల వసూళ్లలో ఖమ్మం జిల్లాలోనే ముదిగొండ మండలం ముందంజలో ఉంటూ ఇతర మండలాలకు ఆద ర్శంగా నిలిచింది. మండలం లో ఉన్న 25 పంచాయతీల్లో ఏడు పంచాయతీ లైన మల్లన్న పాలెం, పమ్మి, ఖానా పరం, వల్లాపురం, కట్టకూరు, అమ్మపేట, లక్ష్మి పురం గ్రామ పంచాయ తీల్లో సుమారు వంద శాతం పన్నులు వసూలు అయ్యాయి. మండలం లో రూ.1,01,76,947 ఇంటి పన్నులు వసూలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు పైన తెలిపిన గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు, సిబ్బంది కృషి చేసి నూరు శాతం పన్నులు వసూలు చేసారు. మిగిలిన గ్రామాల్లో కూడ సుమారు 75 శాతం పన్నులు వసూలు పూర్తి అయ్యాయి. గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పన్నులు చెల్లిస్తున్నా రని అధికారులే చెప్పటం విశేషం. ఇదిలా ఉండగా పంచాయతీ కార్య దర్శులు, సిబ్బంది కష్టపడి ఇంటి పన్నులు వసూలు చేసి బ్యాంకు ల్లో జమ చేసిన డబ్బులను ప్రభుత్వం తమ అవసరాలకు వాడుకోవడం గమనార్హం. ఇప్పటి వరకు ముదిగొండ మండలం లో వసూలు చేసిన రూ. 62,97,126 లు ఇంటి పన్నులు బ్యాంకు ల్లో వేసిన తక్షణమే ప్రభుత్వం ఇతర అవసరాలకు ఆ డబ్బులను వినియోగించింది. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎకౌంటు లో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో పంచాయతీ సిబ్బంది కి జీతాలతో పాటు చెత్త ట్రాక్టర్ల కు డీజిల్, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలుకు ఇబ్బందిగా ఉన్నదని కార్యదర్శులు ఎవరికి చెప్పు కోలేక లోలోపల మదన పడుతున్నారు. ప్రభుత్వం తమ నిధులు విడు దల చేయకపోయినా ఫర్వాలేదు కనీసం వాడుకున్న పంచాయతీల ఇంటి పన్నులైన తక్షణమే విడుదల చేస్తే పల్లే సీమలు అభివృద్ధి వైపు సాగేందుకు మార్గం సుగమం అవుతుంది.

**అన్ని గ్రామాల్లో వంద శాతం సాధిస్తాం : ఎంపిఓ వాల్మీకి కిషోర్**

మండలం లో ఏడు పంచాయతీల్లో సుమారు నూరు శాతం వసూలు చేశాం. పన్నుల వసూళ్లలో జిల్లాలోనే ముందంజ ఉన్నాం. మిగిలిన అన్ని పంచాయతీల్లో లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నాం. కొన్ని గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించటానికి ముందుకు వస్తున్నారు. ప్రజలు సకాలంలో ఇంటి, నీటి పన్నులు చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలి.

## కోల్ ఇండియా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను ఘనంగా నిర్వహించాలి



ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ : సింగరేణి కాలరీస్ కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో కొత్త గూడెం ప్రకాశం స్టేడియం నందు ఈ నెల 22, 23 వ తారీఖు లలో జరిగే కోల్ ఇండియా స్థాయి అథ్లెటిక్స్ మహిళా, పురుషుల పోటీల నిర్వహ ణపై సింగరేణి ప్రధాన కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిఎం పర్సన ల్వెల్ఫేర్, ఐఆర్ పిఎం కవితా నాయుడు కార్పొరేట్ ఏరియా ఈఎం, సెక్యూరిటీ, సివిల్, ట్రాన్స్పోర్ట్, ఫైనాన్స్, పర్చేస్, ఫారెస్ట్, మెడికల్ డిపార్ట్మెంట్ల అధి కారులతో చర్చించారు. ఈ సంధర్భంగా జీఎంపర్సనల్ వెల్ఫేర్, ఐఆర్ పిఎం కవితా నాయుడు మాట్లాడుతూ, 202425 ఆర్థిక సంవత్సరానికి కోల్ ఇండియా స్థాయి అథ్లెటిక్స్ మహిళా పురుషుల పోటీలను సింగ రేణి కార్పొరేట్ ఏరియా నిర్వహిస్తుందని, ఈ పోటీలకు కోల్ ఇండియా పరిధిలోని లోని మొత్తం 10 బొగ్గు సంస్థల జట్లు తలపడుతాయని, కావున ఈ అథ్లెటిక్స్ మహిళా, పురుషుల పోటీల నిర్వహణకు కావల సిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత కార్పొరేట్ ఏరియా ఈఎం, సెక్యూ రిటీ, సివిల్, ట్రాన్స్పోర్ట్, ఫైనాన్స్, పర్చేస్, ఫారెస్ట్, మెడికల్ డిపార్ట్మెంట్ల అధికారులకు సూచించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా సంస్థ ఛైర్మన్ అండ్ మేనే జింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్, ఐఆర్ఎస్ పాల్గొంటారని, ఈ కార్యక్రమంలో పాల్గొనే 10 బొగ్గు సంస్థల అథ్లెటిక్ క్రీడకారులు పాల్గొంటారని వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసి ఈ అథ్లెటిక్స్ మహిళా పురుషుల పోటీలను విజయవంతం చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేసి, తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో జీఎం పర్సనల్ వెల్ఫేర్, ఐఆర్ పిఎం కవితా నాయుడు, జిఎం ఈఎం సెంట్రల్ వర్క్ షాప్ ఎన్.దామోదర రావు తో పాటు, డిజిఎం పర్సనల్ జి.రాజేంద్ర ప్రసాద్, డిజిఎం సివిల్ పి.రాజశేఖర్, ఏసిఎంఓ కే.నాగరాజు, ఎస్ఓటు జిఎం సెక్యూరిటీ జే.వేణు మాధవ్, ఎస్ఈ ఈఎంరామ శేషయ్య, మేనేజర్ ఫారెస్ట్రి ఆర్.బి. డేవిడ్ అభిలాష్, పర్సనల్ మేనేజర్ ముకుంద సత్యనారాయణ, పర్సనల్, ఈఎం, సెక్యూరిటీ, సివిల్, ట్రాన్స్పోర్ట్, ఫైనాన్స్, పర్చేస్, ఫారెస్ట్, మెడికల్ డిపార్ట్మెంట్ల అధికారులు సిబ్బంధి పాల్గొన్నారు.

## సింగరేణి వాహనాలు అడ్డగింత



ప్రజాపక్షం/సత్తుపల్లిః గత నాలుగు రోజులుగా తమకు న్యాయం చేయా లంటూ రిలే నిరాహార దీక్షకు కొనసాగి స్తున్న అంబేద్కర్ నగర్ కాలనీవాసులు గురువారం సింగరేణి అధికారుల వాహ నాలను అడ్డగించి నిరసన తెలిపారు. సింగరేణి అభివృద్ధికి తాము భూములి చ్చామని, నేడు మా అభివృద్ధి, సంక్షే మాన్ని మరిచిన అధికారులు తమ కష్టాలు పట్టనట్లు వ్యవహరించడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. తమ భూముల్లో రాకపోకలు నిలిపి వేయాలంటూ డిమాండ్ చేస్తూ జె.వి.ఆర్ ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహ్లాద్ వాహనాన్ని నిర్బంధించారు. ఇంతకాలం సింగరేణి సంస్థకు సహకరించామని ఇకపై సింగ రేణి ఆటలు సాగవని హెచ్చరించారు. ఐదు రోజులుగా శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్నామని, శుక్రవారం నుండి కార్యక్రమంలో మరో రూపంలోకి మారు తుందన్నారు. తమ కాలనీలను, ప్రజలను కాలుష్యం బారి నుండి కాపాడుకోవటానికి ప్రాణత్యాగాలకైనా సిద్ధమన్నారు.

## విద్యుత్ ఆర్టిజన్స్‌ను పర్మనెంట్ చేయాలి

### -ఎమ్మెల్యే కూనంనేని



ప్రజాపక్షం/పాల్వంచ : తెలంగాణలో విద్యుత్ రంగంలో పనిచేస్తున్న 20వేల మంది ఆర్టిజన్ కార్మికులను వెట్టిచాకిరి నుండి విముక్తి చేసి రెగ్యులర్ ఉద్యోగులుగా పర్మినెంట చేసి వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనస భ్యులు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరా రు. గురువారం పాల్వంచలో తెలం గాణ రాష్ట్ర విద్యుత్ ఆర్టిజన్స్ నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కూనంనేని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ..20వేల మంది తెలంగాణ మొత్తం 4కోట్ల మందికి విద్యుత్ వెలుగులు అందిస్తూ ఆర్టిజన్స్ కుటుంబాలు కొవ్వొత్తిలా కరిగి పోతున్నా యని, చాలి చాలని వేతనంతో జీవిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, ఆర్టిజన్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నరాటి ప్రసాద్, ఏఐ టీయూసీ రాష్ట్ర సీనియర్ నాయకులు బి.అయోధ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ శంకర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లం ఓదెలు, కోలా శ్యాం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షు లు కంచెర్ల జమలయ్య, దేవరకొండ శంకర్, కె.సాయర్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు రండి

### -ఐటీడీఏ పీవోకు ఆహ్వానం



ప్రజాపక్షం / పాల్వంచ : శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుక లను పురస్కరించుకొని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్ ను గురువారం బంజారా సంఘం నాయకులు మర్యాద పూ ర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందచే శారు. ఈ నెల 17వ తేదీన లక్ష్మి దేవిపల్లి మండల పరిధిలోని ఎదురుగడ్డ గ్రామ పంచా యితీలో జరిగే శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు ముఖ్యఅతిధిగా హాజరు కావాలని పీవో ను కోరారు. ఈ సందర్భంగా పీవో సానుకూలంగా స్పందించి తప్పకుండా హాజరువుతానని తెలిపినట్లు బంజారా సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ తనయుడు మాలోత్ విగ్నేష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవిలాల్ నాయక్, మాజీ జిల్లా అధికారి జూంకిలాల్, లాలు నాయక్, కృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు విజయ్‌నాయక్, సేవలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్, యువజన కాంగ్రెస్ నాయకులు అభినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారక్క గద్దెలను దర్శించుకున్న సీతక్క



ప్రజాపక్షం/కరకగూడెంః కరకగూడెం మండలం చిరుమళ్ళ గ్రామంలో చందా వంశ స్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మ క్క సారక్క వనదేవతల జాతరకు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ , శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విచ్చేసి సమ్మక్క సారక్క గద్దెలను దర్శించుకున్నారు. అనంతరం మంత్రి సీతక్క ఆదివాసి గిరిజను లతో నృత్యం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమ్మక్క సారక్క వనదేవతల ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికీ కలగజేయాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య, చందా సంతోష్, కరకగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇక్బాల్ హుస్సేన్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీ సీలు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, యువజన నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆలోచన శక్తిని పెంపొందించుకోవాలి



ప్రజాపక్షం/ తల్లాడ : విద్యార్థులు పట్టుదల, ఆలోచనశక్తిని పెంపొందించుకుని నేటి ప్రపంచంలో ముందుకుసాగాలని డాన్‌బాస్కో ఫాదర్ జస్టిన్ సూచించారు. గురువారం స్థానిక డాన్‌బాస్కో పాఠశాలలో పాఠశాల విద్యార్థులకు మోటివేషన్, కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పట్టుదల, ఆలోచన శక్తి పెరగాలంటే ప్రతి విషయంలో ఆసక్తిగా ఉండాలని, ప్రపంచ వ్యాప్తంగా గొప్ప వ్యక్తులు తయారైన వాళ్లం దరూ కూడా చిన్ననాటి నుండి ఎన్నో కష్టాలను అనుభవించారని, ఆతర్వతనే వారి ఆలోచన ధోరణిలో మార్పు రావడంతోనే ఉన్నత శిఖరాలు చేరుకున్నారని వివరించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం జస్టిన్‌ను ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫాదర్ ప్రదీప్‌రెడ్డి, జోసఫ్, రవి, కిరణ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో సంవత్సరకాలం పూర్తి చేసుకున్న కమిషనర్









**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ కమీషనర్‌గా 2024 ఫిబ్రవరి14న బాధ్యతలు చేపట్టిన వైరా మున్సిపాల్ కమీషనర్ చింతా వేణు నేటికి సంవత్సరకాలం విధి నిర్వహణ పూర్తి చేసుకున్నారు. వైరా మున్సిపాలిటీలో కమీషనర్‌గా విధులు నిర్వహించడానికి ఎవరూ రావడానికి భయపడ్డ సందర్భాలు ఉన్నాయి. వచ్చిన కూడా కొన్ని రోజుల్లోనే నెలల వ్యవధిలోనే వెళ్లిన అధికారులు ఉన్నారు. చింతా వేణు సంవత్సరకాలం విధి నిర్వహణ నిర్వహించడం పట్ల ప్రజలు కూడా సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. వరదల సమయంలో జిల్లా అధికారుల సూచనలు స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలను పాటిస్తూ పునరావాస కేంద్రాలను బాలికల పాఠశాల నందు ఏర్పాటు చేసి ఇందిరమ్మ కాలనీ, నాల్గో వార్డు లోతట్టు ప్రాంత ప్రజలకు అండగా ఉండి నిత్యం వారికి ఇబ్బందులు కలగకుండా చూశారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నేటి వరకు అన్ని వర్గాల ప్రజలకు సమస్యల పట్ల అందుబాటులో ఉంటూ ప్రజాప్రతినిధులు, ప్రజలు మున్సిపాల్ సిబ్బంది ప్రజలు సహకారంతోనే సంవత్సర కాలంలోనే విధులు నిర్వహించడం జరిగిదని కమీషనర్ వేణు తెలిపారు. ఈ సందర్భంగా సంవత్సర విధి నిర్వహణలో భాగంగా ప్రజాపక్షంతో కమీషనర్ వేణు మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి ధ్యేయంగా అందరు సహకారంతో కలిసి పనిచేస్తానని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశాల మేరకు సూచనలు మేరకు పనిచేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అందేలా కృషి చేస్తామని సంవత్సర కాలంలో వైరా మున్సిపాలిటీలోని అన్ని రాజకీయపార్టీల నాయకులు సహాయ సహకారాలు అందించారని రానున్న రోజుల్లో వైరా మున్సిపాలిటీ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తానని అన్నారు. ప్రజలు సమస్యలను నేరుగా నన్ను కలిసి వివరించవచ్చని మున్సిపాల్ సిబ్బంది సమస్యలపరంగా ఎప్పుడు అందుబాటులో ఉంటారని తెలిపారు. వేసవి కాలం నేపద్యంలో పలు ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని అదేవిధంగా జిల్లా అధికారుల సూచన మేరకు మరిన్ని కార్యక్రమాలు మున్సిపాలిటీలో చేపట్టడం జరుగుతుందని అన్నారు. పన్నులు వసూలు చేసి మున్సిపాలిటీ ఆదాయం పెంచేందుకు కృషి చేస్తామన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు చూపిన ఆదరణతో మరింత ముందుకు పోతానని మున్సిపాలిటీ అభివృద్ధికి అందరితో కలిసి ముందుకు సాగుతామన్నారు.

# వైభవంగా గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠామహోత్సవం



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండలంలో గ్రామంలో హర హర ఫౌండేషన్ చైర్మన్ మారగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామదేవతలైనటువంటి ముత్యాలమ్మ, పెద్దమ్మ తల్లి నూతన ఆలయాలు విగ్రహాల ప్రతిష్టల కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైరా నియోజకవర్గ ఎంఎల్‌ఏ మాళోత్ రాందాస్ నాయక్, అశ్వారావుపేట మాజీ ఎంఎల్‌ఏ తాటి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. కాగ వారికి ఆలయ కమిటీ సభ్యులు మారగాని శ్రీనివాసరావు ఘనంగా సాదర స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత మూడు రోజుల నుండి వేద పండితులచే మంత్రోచ్ఛారణలతో యజ్ఞ హోమాలతో ప్రత్యేక పూజలు అనుసరిస్తూ, విగ్రహ ప్రతిష్టలను చేశారు. గ్రామ ప్రజలు ఆడపడుచులు అత్యధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. గ్రామంలో గ్రామ దేవతలుగా కొలుచుకునే ముత్యాలమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి ఆలయాల నూతనంగా ఏర్పాటు చేయడానికి ఆలయల నిర్మాణ కర్త మారగాని శ్రీనివాసరావు ఎన్నో వ్యవయ ప్రయాసలతో గ్రామ ప్రజలకు సుందరమైన ఆలయ నిర్మాణాలను నిర్మించడం జరిగింది. ఈసందర్భంగా గ్రామ ప్రజలు ఆయనను భక్తి ప్రశంసలతో అభినందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి రాంబాబు, చల్లా రమేష్, ధరావత్ పుల్లారావు, రాముడు, ధరావత్ శ్రీను, ధరావత్ నాగేశ్వరరావు, మారగాని రవి, చిట్టి బొమ్మల కోటిహరి, గ్రామ పెద్దలు, మండల కాంగ్రెస్ నాయకులు వనమా గాంధీ, జంగాల శ్రీనివాసరావు, కృష్ణారెడి, కల్లోజు నరసింహారావు, వేలాదిగాప్రజలు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

# జెఈఈ మెయిన్స్‌లో మెరిసిన మరో బ్రిలియంట్ ఆణిముత్యం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలం నుండి స్థానిక సారపాకలో గల బ్రిలియంట్ జూనియర్ కళాశాల నందు ఇంటర్మీడియట్ ఎంపిసి చదువుతున్న బి సంయుక్త ఇటీవల విడుదలైన జెఈఈ మెయిన్స్‌లో 79శాతంతో జాతీయ స్థాయిలో ఉత్తీర్ణత సాధించి, అందరిని అబ్బుర పరిచింది. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బ్రిలియంట్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ బిఎన్ఆర్, సారపాక గ్రామ పంచాయితీ ఈవో మహేష్ జెఈఈ మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన బి సంయుక్తను శాలువా, మెమోంటోలతో సత్కరించి, అభినందించారు. ఈసందర్భంగా ఈవో మహేష్ మాట్లాడుతూ ఇలాంటి మారుమూల ప్రాంతమైన ఏజెన్సీ ప్రాంతంలో ఎన్నో కాంపిటేషన్ పరీక్షలకు విద్యార్థులకు తయారు చేస్తూ మా గ్రామంలో ఒక మంచి విద్యాసంస్థ ఉన్నందున ఈ గ్రామ ఈవోగా నేను ఎంతగానో గర్వపడుతున్నానని, మీ పిల్లలను జెఈఈ మెయిన్స్, జేఎన్‌టీయూ, నవోదయ, సైనిక్, ఏకలవ్య వంటి ప్రముఖ, విద్యాసంస్థలకు పంపిస్తున్న బ్రిలియంట్ విద్యాసంస్థల ఛైర్మన్ బిఎన్ఆర్ కృషిని ఎంతగానో కొనియాడారు. ప్రముఖులు తల్లి దండ్రులు కూడా ఎంతగానో ప్రశంసించారు. ఈకార్యక్రమంలో కాలేజ్ అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలియజేయండి

**ప్రజాపక్షం/చంద్రుగొండ:**పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలియజేయాలని రాజకీయ నాయకులకు ఎంపీడీవో అశోక్ తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23893 ఓటర్లు ఉన్నారని, అదే విధంగా మండల పరిధిలో 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. రాజకీయ నాయకులు పెద్దిరి వేణు, కిసరి కిరణ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వారా సత్యనారాయణ, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం..



**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లిలో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతుందని బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు అంతోటి అచ్చయ్య, ఇల్లందు నియోజకవర్గ నాయకులు మూడు కృష్ణ ప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రమైన కామేపల్లిలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కానీ హామీలను వాగ్దానం చేసి ప్రజలను మోసం చేసిందన్నారు. ఎన్నికలకు ముందు ఎన్నికల తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఆరు గ్యారెంటీలు అమలు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా, మండల నాయకులు బోడేపూడి వీరప్రతాప్, వడియాల కృష్ణారెడ్డి, మల్లెంపాటి శ్రీనివాసరావు, సామ మోహన్‌రెడ్డి, కాట్రాల రాంబాబు, అజ్మీర రామకోటి, బట్టు శంకర్, అజ్మీర రాజు, బన్సీ, మేదర శ్రీను, ఎండి జావీద్, గండమాల చందు, కన్నమాల రాంబాబు పాల్గొన్నారు.

# బ్యాలెట్ ముద్రణకు సీల్డ్ కొటేషన్లు సమర్పించాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల నిమిత్తం బ్యాలెట్ పేపర్ల ముద్రణకు ఆసక్తి గల ప్రింటింగ్ ప్రెస్ వారు ఈనెల 17లోపు సీల్డ్ కోటేషన్లు సమర్పించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిటిసి జెడ్పిటిసి ఎన్నికలు 2025 నిమిత్తం బ్యాలెట్ పేపర్లు ముద్రణ చేయుటకు ఆసక్తి గల ప్రింటింగ్ ప్రెస్ షాపు వివరాలు, రోజు వారి ముద్రణ సామర్థ్య వివరాలతో ఈనెల 17న మధ్యాహ్నం రెండు గంటల లోపు ముఖ్య కార్యనిర్వహణ అధికారి జిల్లా ప్రజాపరిషత్ ఖమ్మం నందు సీల్డ్ కోటేషన్లు సమర్పించాలన్నారు. ఈనెల 19న సాయంత్రం నాలుగు గంటలకు జిల్లా కొనుగోలు కమిటీ ద్వారా ముద్రణ ధరలను ఫైనల్ చేసే సమావేశానికి హాజరు కావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

# మధిర ఎస్‌హెచ్ఓగా రుత్వికిసాయి బాధ్యతలు స్వీకరణ



**ప్రజాపక్షం/ మధిర :** మధిర ఎస్‌హెచ్ఓగా ఐపిఎస్ రుత్విక్ సాయి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలు ట్రైనింగ్ పిరియడ్‌లో ఉంటానని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే యువత మత్తు పదార్థాలకు బానిసకాకండా దూరంగా ఉండాలని, నిషేదిత గంజాయి లాంటి మత్తు పదార్థాలు అమిన్నా, కొన్న చట్టపరమైన చరర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని సూచించారు.

# విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలి

**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** రాబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని హెచ్ఎం నండూరి విజయశ్రీ సూచించారు. గురువారం మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్నల్ మార్క్స్ వెరిఫికెషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం పదవ తరగతి పరీక్షలకు సంబంధించి ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలిచ్చారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు సరైన తరిఫీదు ఇవ్వాలని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయుల రికార్డులను పరిశీలించి విద్యార్థులకు మార్కులను కేటాయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్‌కె.సాబీర్‌బేగం, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/ మధిర :** ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తెలంగాణ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపు మేరకు నేడు జరిగే తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలని పోరాట సమితి నాయకులు నల్లపు శేఖర్, బొల్లెద్దు రాజేందర్, బుర్రి నాగరాజు, నీలం రమేష్, గండమాల ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టనున్న బంద్‌కు మధిర వ్యాపార, వాణిజ్య వర్గాలు, విద్యాసంస్థలు, హోటళ్లు తదితర వ్యాపార వర్గాలు సహకరించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు.

# పాఠశాలకు వాటర్‌ప్యూర్‌పై గ్రీజర్ బహుకరణ



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురం ఉన్నత పాఠశాలకు వాటర్ ప్యూర్‌పై గ్రీజర్‌ను జమలాపురం గ్రామానికి చెందిన మాజీ పోస్ట్‌మాస్టర్ అల్లూరి సాయిభాను(భానుమతి) జ్ఞాపకార్థం వారి భర్త దేవాదాయ శాఖ మాజీ ఈఓ అల్లూరి విష్ణుమూర్తి గురువారం పాఠశాల హెచ్ఎం నాగలవంచ జ్యోతిశ్రీకి అందచేశారు. ఈసందర్భంగా విష్ణుమూర్తి మాట్లాడుతూ పదో తరగతిలో మొదటి, రెండస్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులంతా బాగా చదివి పాఠశాలకు, గ్రామానికి పేరు తేవాలని కోరారు. అనంతరం పాఠశాల యాజమాన్యం దాతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో త్వరలో నిర్వహించనున్న ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణలో భాగంగా వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీడీవో మహాలక్ష్మి మాట్లాడుతూ త్వరలో నిర్వహించబోయే ఎంపీటీసీ, జెడ్‌పిటిసి ఎన్నికలకు సంబంధించినటువంటి పోలింగ్ బూతులను ఏర్పాటు చేయడం, అదే విధంగా ఓటర్ లిస్ట్‌లను ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు జూబ్బూరు రమేష్, టిడిపి మండల అధ్యక్షులు పానుగంటి రామారావు, సిపిఐ నాయకులు పలగాని రామకృష్ణ, సిపిఎం మండల కార్యదర్శి జంగిలి వెంకటరత్నం పాల్గొన్నారు.

# ఘనంగా బ్రహ్మయ్య జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండలంలో గల మల్లెలమడుగు గ్రామ పంచాయితీలో గల అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఉమ్మడి జిల్లా డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య జన్మదిన వేడుకలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాదిగ జేఏసి జిల్లా సెక్రటరీ దేపంగి వెంకటరమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో నంద్రు నరేష్, గొడ్ల రమేష్, నాంద్రు వేంకటి, నందిపటి వెంకన్న, రెడ్డి కృష్ణా, రావులపల్లి నాగేశ్వరరావు, పెద్ద వేంకటి, రాము, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయిలో ఛాంపియన్లుగా నిలవాలి

**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా**



ప్రజాపక్షం/పాల్వంచ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా యూత్ అథ్లెటిక్స్ సెలక్షన్ ట్రయల్స్‌ను గురువారం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా ఒలింపిక్ జెండా ఊపి పరుగు పందెం పోటీలను ప్రారంభించారు. పట్టణ పరిధి శ్రీనివాసకాలనీలోని స్టేడియంలో జరుగుతున్న జిల్లా యూత్ అథ్లెటిక్స్ సెలక్షన్ ట్రయల్స్ కు సాబీర్‌పాషా ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ..గత సంవత్సరం భద్రాద్రి జిల్లా అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయిలో ఛాంపియన్లుగా నిలవడం అభినందనీయమన్నారు. అదే స్ఫూర్తితో ఈ సంవత్సరం కూడా రాష్ట్ర స్థాయిలో ఛాంపియన్లుగా నిలవాలని కోరారు. జిల్లా క్రీడాకారులకు గ్రౌండ్స్, క్రీడా పరికరాలు, పుస్తకాలు అందించడానికి తనవంతు కృషి ఎప్పుడు ఉంటుందని హామీ ఇచ్చారు. జిల్లా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో పతకాలు సాధించడం ద్వారా జిల్లాకు పేరు, గుర్తింపొస్తుందన్నారు. అనంతరం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ యుగేందర్ మాట్లాడుతూ..జిల్లాలో రాష్ట్ర, జిల్లా పోటీల నిర్వహణకు సాబీర్‌పాషా సహకారం మరువలేనిదని అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ మాట్లాడుతూ..ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుండి సుమారు 120 మంది హాజరయ్యారని అన్నారు. వారి నుండి 30 మంది అథ్లెట్లును ఎంపిక చేసి ఈ నెల 18న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్శిటీ గ్రౌండ్‌లో జరగబోవు రాష్ట్ర యూత్ అథ్లెటిక్స్ ఛాంపియన్స్‌కు పంపుతామని తెలిపారు. ఈ ఎంపికలు జిల్లా అథ్లెటిక్ కోచ్‌లు పి.నాగేందర్, జన్ను గిరిప్రసాద్, కృష్ణ, ఉదయ, ఎర్రయ్య, పిడి శ్వేతలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొండలరావు, అడ్వకేట్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సంవత్సరకాలం పూర్తి చేసుకున్న ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్



ప్రజాపక్షం/వైరా: ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్ వైరా సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి నేటికి సంవత్సరకాలం పూర్తి చేసుకున్నారు. హన్మకొండకు చెందిన వంశీకృష్ణ భాగ్యరాజ్ బిటెక్ పూర్తి చేసిన తర్వాత ఎస్సై ఉద్యోగం పొంది ఖమ్మం జిల్లాలో ప్రొబిషన్ పూర్తి చేసుకొని తొలి పోస్టింగ్‌గా వైరాలో బాధ్యతలు చేపట్టారు. 2024 ఫిబ్రవరి 14న వైరా ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన వంశీకృష్ణ భాగ్యరాజ్ నేటికి సంవత్సరం పూర్తి చేసుకున్నారు. సంవత్సర కాలంలో శాంతి భద్రతల పరిరక్షణలో వంశీకృష్ణ భాగ్యరాజ్ పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ వారి సూచనల మేరకు విధి నిర్వహణలో ఎక్కడ ఎలాంటి సంఘటన చోటు చేసుకోకుండా విధులు నిర్వహించారు. పోలీస్ సిబ్బందితో అందరితో కలిసిమెలిసి ఉంటూ క్రిందస్థాయి ఉద్యోగులైన వారి సూచనలు తెలుసుకొని ముందుకు వెళ్లారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల గురించి వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పట్ల యువతకు సూచనలు ఇవ్వడం క్రైమ్ రేట్ తగ్గించడంలో రాజీ ఫార్ములాను పాటించారు. సంవత్సరకాలం పూర్తి సందర్భంగా ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్ ప్రజాపక్షంతో మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని, భవిష్యత్తులో ఎంతో కలిగి ఉన్న యువత చదువుపై ఏకాగ్రత చూపించి ఉన్నతస్థాయికి ఎదిగి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆయన సూచించారు. సంవత్సర కాలంలో వైరా పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించడంలో ఏసిపి రెహమాన్, సిఐ సాగర్ అందించిన తోడ్పాటు ఎప్పటికి మరువలేనిదని అన్నారు. ముఖ్యంగా వైరా మండలంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు అన్ని వర్గాల ప్రజలు పోలీస్‌కు అందిస్తున్న సహాయ సహకారాలు ఫ్రెండ్లీ పోలీస్‌కి నిదర్శనమని ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్ తెలిపారు.

## లయన్స్‌క్లబ్ ఆఫ్ వైరా గ్రేట్ విజన్, లయన్స్‌క్లబ్ ఆఫ్ వైరా ఆధ్వర్యంలో అన్నదానం



ప్రజాపక్షం/వైరా: వైరా గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు లయన్ తోటకూర శ్రీకాంత్, వైరా క్లబ్ అధ్యక్షులు లయన్ చింతలపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అలిమికో సంస్థ వారు నిర్వహించిన క్యాంపుకు విచ్చేసిన వయోవృద్ధులు వికలాంగులకు శారీరక దివ్యాంగులకు ఇచ్చు వాకింగ్ స్టిక్స్ వాకర్స్ వినికిడి యంత్రాలు బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్స్ కృత్రిమ కాళ్ళు కోసం వైరా నియోజకవర్గ వ్యాప్తంగా వైరాలో రైతువేదిక నందు నిర్వహించిన క్యాంపుకు లయన్ డాక్టర్ లగడపాటి చరిత, డాక్టర్ అవినాష్ ఆర్థిక సహాయంతో 500 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ అలిమికో సంస్థ వారు నిర్వహించిన క్యాంపును వైరా నియోజకవర్గ ప్రజలు అందరు పాల్గొని వారు అందిస్తున్న పరికరాలను జాగ్రత్తగా వాడుకోవాలని గతంలో కూడా అలిమికో సంస్థ కలిసి క్యాంపు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎస్‌టి కోఆర్డినేటర్ వుండ్రు శ్యామ్‌బాబు, గంగవరపు కిషన్, జాలా పుల్లారావు, అబ్బూరి రమేష్, పుయ్యూరు రామకృష్ణ, మర్రికంటి రాంగోపాల్, పులి కృష్ణార్జునరావు, గొల్లమందల బాబు, ఏపూరి రాజారావు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## నాగారంలో సిపిఐ గ్రామ శాఖ మహాసభ విజయవంతం

**- నాగారం గ్రామ శాఖ నూతన కమిటీ ఎన్నిక**



ప్రజాపక్షం / పాల్వంచ : మండల పరిధి నాగారం గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) గ్రామ శాఖ మహాసభ విజయవంతమైంది. పొదిలి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం పాల్గొని మాట్లాడారు. సీపీఐ పార్టీ నిత్యం ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారానికి అనేక ఉద్యమాలు నిర్వహించి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలం నుంచి ఇప్పటి వరకు ప్రజల తరపున నిలబడి లక్షలాది ఎకరాల భూములు పేదలకు పంచి, ఇంటి స్థలాలు ఇప్పించి, స్థానిక సమస్యల కోసం అవిశ్రాంతంగా పోరాటం చేస్తూ ఎన్నో సాధించి పెట్టిందని, అందుకే కమ్యూనిస్టు పార్టీ ప్రజలలో ఎల్లకాలం మనగలుగుతుందని అన్నారు. నాగారం గ్రామంలో పేద ప్రజలందరూ కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా అభివృద్ధి కావాలని కోరారు. అనంతరం 21మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కార్యదర్శిగా సాయిలు, వెంకన్న, సహాయ కార్యదర్శులుగా దేరంగుల రామయ్య, మహంకాళి, లాజర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సభలో సీపీఐ పార్టీ పాల్వంచ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, మండల నాయకులు నిమ్మల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## 18 ఎంపీటీసీలకు 94 పోలింగ్ కేంద్రాల గుర్తింపు

ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలం లోని 18 ఎంపీటీసీ లకు 94 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయం లో గురువారం అఖిలపక్ష సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడొచ్చిన అన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. మండలం లో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. మండలం లోని పోలింగ్ కేంద్రాల పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గతంలో నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ లో ఉన్న మూడు పోలింగ్ కేంద్రాలను స్థానిక ఉన్నత పాఠశాలలో రెండు, సింగారెడ్డిపాలెం పాఠశాలలో ఒక కేంద్రంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలం లోని పోలింగ్ కేంద్రాలు మొత్తం అదే స్థానంలో ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహశీల్దార్ మాణిక్యారావు మండల పంచాయతీ అధికారి సిహెచ్ శివ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బచ్చలికూర నాగరాజు, బోయిన వేణు, సూరేపల్లి రామారావు,పధానం నాగయ్య, కడియల నరేష్, బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, సయ్యద్ మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

## కస్తూరిబాలో విద్యార్థినులను కరిచిన ఎలుకలు



ప్రజాపక్షం/చంద్రుగొండ: స్థానిక కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులను ఎలుకలు కరిచిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈవిషయంపై వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక కస్తూరిబా పాఠశాలలో ఈనెల 11 రాత్రి విద్యార్థినిలు నిద్రిస్తున్న సమయంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినిలు కాకటి ఉచిత, కాకటి గోపికల కాళ్లపై ఎలుకలు కరిశాయి. మరుసటి రోజు బుధవారం ఉదయం పాఠశాల స్పెషల్ ఆఫీసర్ కవితకు విద్యార్థినిలు తెలియజేయడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఈవిషయం ఎంఈవో సత్యనారాయణకు తెలియటంతో గురువారం హాస్టల్‌ను తనిఖీ చేశారు. అనంతరం దాడిలో గాయపడ్డ విద్యార్థినిలను పరామర్శించారు. హాస్టల్‌లో ఎలుకలను అరికట్టే విధంగా గమ్ము ప్యాడ్‌ను ఏర్పాటు చేయాలని స్పెషల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆదేశించారు.

## దివ్యాంగుల యంత్ర పరికరాల కోసం 222 మంది దరఖాస్తు

ప్రజాపక్షం/వైరా: వైరాలో రైతువేదిక నందు అలిమికో సంస్థ వారు నిర్వహించిన దివ్యాంగుల క్యాంపుకు వయోవృద్ధులు వికలాంగులకు కొరకు ఇచ్చే వాకింగ్ స్టిక్స్ కృత్రిమ కాళ్ళు కోసం వైరా నియోజకవర్గంలోని అన్నిమండలాల దివ్యాంగులకు వైరాలో రైతువేదిక నందు క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో యంత్ర పరికరాల కోసం 222 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 208 మందిని అర్హత కలిగిన వారిగా గుర్తించారు. 13మందిని రిజెక్ట్ చేశారు. 208 మంది దివ్యాంగుల వివరాలను ఆన్‌లైన్ ద్వారా జిల్లా అధికారులకు పంపనున్నారు. ఈ కార్యక్రమంలో సిడిపివో బాలత్రిపుర సుందరి, సూపర్‌వైజర్లు శ్రీలక్ష్మి , జాన్‌బీ, సరిత, ఐసిడిఎస్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలో వికసించిన కుసుమం



ప్రజాపక్షం/కారేపల్లి: ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కారేపల్లి ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థి పొట్ట విక్రమ్ 100కి 86 పర్సంటైజ్ సాధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలకే వన్నె తెచ్చాడు. దీనిని పురస్కరించుకుని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ విజయకుమారి మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రభుత్వ జూనియర్ కళాశాల మీద నమ్మకముంచి, తమ పిల్లలను ప్రభుత్వ కళాశాల్లో చేర్పించాలని, వారిని ఇంతకు పదిరెట్లు మెరుగైన ఫలితాలను సాధించి తీరుతామని తెలిపారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విక్రమ్‌ను అభినందించారు.

## అంతరాష్ట్ర సరిహద్దుల్లో మూడు చెక్‌పోస్టులు

ప్రజాపక్షం/భద్రాచలం : బర్డ్ ఫ్లూ నివారణలో ఇతర రాష్ట్రాల నుండి తెలంగాణ రాష్ట్రంలోనికి దిగుమతి ఉవుతున్న కోళ్లను అరికట్టేందుకు రాష్ట్ర సరిహద్దులైన తేగడ, అల్లిపల్లి, అశ్వారావుపేటలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేసి కోళ్లు, గుడ్లు వాహనాలు వస్తుంటే వాటిని తిరిగి వెనక్కు పంపిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని పౌల్ట్రీ ఫామ్‌లను నిరంతరం పర్యవేక్షించేందుకు ఆర్‌ఆర్‌టి బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కోళ్లకు వైరస్ రాకుండా తీసుకోవాల్సిన ముందుస్తు జాగ్రత్తలను ఇప్పటికే వివరించారని, కోళ్లకు ఏదైనా సమస్య ఉంటే వెంటనే పశుసంవర్ధక శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

## అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

ప్రజాపక్షం/భద్రాచలం : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ హెచ్చరించారు. గురువారం ఆయన చర్ల మండల పరిధిలోని చింతకుంట, మొగళ్లపల్లి ఇసుక ర్యాంపులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్లు,పాయింట్‌లను పరిశీలించారు. లోడింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సొసైటీ అందించి వే బిల్లులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక రీచ్‌లలో నిబంధనలు విరుద్ధగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. అనుమతులు లేకుండా అసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆలయ ప్రాంగణాల్లో తులసి మొక్కలు నాటాలి

ప్రజాపక్షం/భద్రాచలం : ఆలయ ప్రాంగణాల్లో తులసిమొక్కలను విస్తృతంగా నాటాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం ఆయన పర్ణశాల ఆలయాన్ని సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఔషధగుణాలు ఉన్న తులసి మొక్కలను పెద్దఎత్తున ఆలయ ప్రాంగణంలో నాటాలన్నారు. ఇందు కోసం దేవస్థానం వారు సూచించిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరైన చర్యలు తీసుకోవాలని పంచాయితీ, దేవస్థానం అధికారులకు సూచించారు. ఆలయం ముందు విప్పపూలు అమ్ముకునే వారి వద్ద ఆగియన ఆయన వారి వివరాలు అడిగి తెలుసుకుని విప్ప పువ్వును కొనుగోలు చేశారు. ఆయన వెంట దేవస్థానం ఇఓ ఎల్ రమాదేవి, డిఇ రవీంధర్, అనీల్, శ్రీనివాస్ తదితరులున్నారు.

## యువకుని ఆత్మహత్య

ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు లోని ఖాన్‌ఖాన్ పేటలో చౌదరి హోటల్ వెనుక ఎస్టి కాలనీలో నివాసముంటున్న బెజవాడ శ్రీను (26) తనకి ఇంకా పెళ్లి కావడం లేదని ఎన్ని సంబంధాలు చూసినప్పటికీ తన తోటి వారికి పెళ్లి అయిపోతున్నావని తనకు పెళ్లి కావట్లేదని ఆలోచనలో ఉండి త్రాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి చెల్లెలు శోభారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిత తెలిపారు.

